SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 228 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 27 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## ఏసీబీ వలలో రూ. 100 కోట్ల తిమింగలం!

- అక్రమార్జన అభియోగాలపై కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ అరెస్టు
- రాష్ట్రంలోని 14 ప్రాంతాల్లో సోదాలు.. బయటపడిన బండారం
- ప్రాథమిక దర్యాప్తులో రూ.100 కోట్లకు పైగా ఆస్తులు
- అమరావతిలో వాణిజ్య స్థలాలు.. హైదరాబాద్ శివార్లలో స్థిరాస్తులు
- పలు ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయనది కీలకపాత్ర

2లో





## కొత్త నాయకత్వం నిర్మితమవ్వాలి

- ప్రపంచాన్ని ప్రేమ దృక్కోణంలో చూసేలా రాజకీయాలు మారాలి
- ప్రతిపక్షాలకు దారులు మూసేయడంతోనే భారత్ జోడో యాత్ర చేపట్టా
- 4 వేల కి.మీ. పాదయాత్రలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా
- భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**సమయం న్యూస్, హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా రాజకీయాల్లో ప్రాథమికంగా మార్పు వచ్చిందని.. దశాబ్దం క్రితం వర్తించిన నియమాలు ఇప్పుడు ఏమాత్రం పనిచేయడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. డబ్బు, మీడియా గుత్తాధిపత్యం పెరిగిందని.. ఇది మొత్తం రాజకీయాల స్వభావాన్నే మార్చేసిందన్నారు. ప్రపంచాన్ని ప్రేమ, ఆప్యాయత, సానుభూతి అనే దృక్కోణంలో చూసేలా రాజకీయాలు మారాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాజకీయాల్లో కొత్త తరువాయి 2లో

## పదేళ్లలో అన్ని రంగాల్లో పెనుమార్పులు

: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

- వైద్య విద్యార్థులకూ టెక్నాలజీ ముఖ్యమే..
- ఏఎంసీ పూర్వ విద్యార్థులు నిర్మించిన శతాబ్ది భవనాన్ని ప్రారంభించిన సీఎం

**సమయం న్యూస్, విశాఖపట్నం,:** 'పదేళ్లలో అన్ని రంగాల్లో పెను మార్పులు రానున్నాయి. టెక్నాలజీ ఉపయోగించుకొని ముందుకెళ్లినవారు అద్భుతాలు సృష్టిస్తారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తరువాయి 2లో



## గుజరాత్‌లో వెయ్యి మంది బంగ్లా అక్రమ వలసదారులు

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

**సమయం న్యూస్,** అహ్మదాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. వలసదారులపై ప్రత్యేక నిఘా పెట్టాయి. ఈ క్రమంలోనే గుజరాత్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన 1,000 మందికిపైగా అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తప్పుడు ధ్రువపత్రాలతో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘ్వీ శనివారం వెల్లడించారు. అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లో సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. అక్కడ ఫోర్జరీ పత్రాలు పొంది దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు వివరించారు. వీరందరి పత్రాలను పరిశీలించిన తర్వాత.. త్వరలోనే దేశం నుంచి పంపిస్తామని హర్ష్ సంఘ్వీ వెల్లడించారు.






## ముగిసిన పోప్ అంత్యక్రియలు

- ట్రంప్ సహా ప్రపంచ నేతల హాజరు

**సమయం న్యూస్, వాటికన్:** క్యాథలిక్‌ల మత గురువైన వాటికన్ అధిపతి పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం ముగిశాయి. నిర్దిష్ట క్రతువులు ముగిశాక ఆయన పార్థివ దేహంతో కూడిన పేటికను కార్డినళ్లు సంప్రదాయబద్ధంగా రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో ఖననం చేశారు. పోప్ ఫ్రాన్సిస్‌కు సన్నిహితులైన కార్డినళ్లు ఈ క్రతువులో పాల్గొన్నారు. పోప్ బాధ్యతల్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్న వాటికన్ కోశాధికారి (కామెర్లెంగో) కార్డినల్ కెవిన్ ఫారెల్ తరువాయి 2లో

## గులాబీ రజతోత్సవ సంబురం

- ఎల్కతుర్తిలో నేడు బహిరంగ సభ
- కేసీఆర్ సహా హాజరుకానున్న పార్టీ నేతలు
- పునరుత్తేజమే లక్ష్యంగా దిశానిర్దేశం చేయనున్న భారాస అధినేత



**సమయం న్యూస్,** హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001లో ఆవిర్భవించి.. 13 ఏళ్లు ఉద్యమ పార్టీగా.. తొమ్మిదిన్నరేళ్లు అధికార పార్టీగా.. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీగా భిన్నపాత్రలు పోషిస్తున్న భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ సంబరానికి సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస)గా మొగ్గ తొడిగిన పార్టీ.. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే తొలి ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చింది. ఎనిమిదేళ్ల తర్వాత జాతీయస్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో 2022లో 'భారాస'గా రూపాంతరం చెంది.. ఇప్పుడు రజతోత్సవ సభ ద్వారా తిరిగి సత్తా చాటేందుకు సన్నద్ధమైంది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం సాయంత్రం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగసభలో ప్రసంగించడం ద్వారా కార్యకర్తలను తిరిగి కార్యోన్ముఖులను చేయనున్నారు. గులాబీ దళం ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేసే దిశగా పనిచేస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా రెండు దఫాలు విజయాలతో అధికారం చేపట్టి.. మూడోసారి ఓటమి చెందిన భారాస.. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ప్రతిపక్ష పాత్రలో భాగంగా.. తరువాయి 2లో

## చెయ్యాల్సింది చాలా ఉంది..

- మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్‌కు కాలుష్యం నుంచి విముక్తి
- తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లు మీరే
- భారత్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: 'మేం ఇప్పుడే పని మొదలుపెట్టాం.. ఇంకా చేయాల్సింది చాలా ఉంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల జీవితాలను మార్చేందుకు తాము చేపట్టిన అభివృద్ధి మిషన్‌లో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. హైటెక్స్ నోవాటెల్ హోటల్‌లో జరుగుతున్న 'భారత్ సమ్మిట్'లో శనివారం ఆయన మాట్లాడారు. ''పలు దేశాల నుంచి వచ్చిన నిపుణులైన

తరువాయి 2లో




## నిష్పాక్షిక విచారణకు సహకరిస్తాం

- సింధు జలాల్ని ఆపేస్తే దీటుగా బదులిస్తాం: షెహబాజ్
- అన్నింటా హిందువులు, ముస్లింలు వేర్వేరు: మునీర్
- పహల్గాంపై రెచ్చగొట్టేలా పాక్ నేతలు, సైన్యాధిపతి వ్యాఖ్యలు

2లో



# కొత్త నాయకత్వం నిర్మితమవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వం నిర్మితం కావాల్సిన అవసరముందన్నారు. విపక్షాలు చెప్పేది వినకుండా వాటిని అణచివేసే ధోరణి పెరిగిందని, ఈ కారణంగానే తాను 4 వేల కి.మీ. మేర పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను తిరిగి పొందడంతోపాటు వాటి సంరక్షణ వంటి ప్రాథమ్యాలను కొత్త రాజకీయ దృక్కోణం ద్వారా పునర్నిర్మించడం ఇప్పుడు అందరి ముందున్న నిజమైన సవాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో శనివారం 'భారత్ సమ్మిట్' ముగింపు సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. ''దేశంలో కొన్నేళ్ల క్రితం ప్రతిపక్షాలకు దారులు క్రమంగా మూసుకుపోయిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీపరంగా చిక్కులు ఎదుర్కొన్నాం. మా పార్టీ కోరుకున్న విధంగా నడుచుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దాదాపుగా ఒంటరి అయిన పరిస్థితులు నెలకొన్నాయి. దాన్ని అధిగమించడానికి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాం. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దాదాపు 4 వేల కిలోమీటర్ల మేర నేను స్వయంగా పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నా. ఒకసారి దాన్ని ప్రారంభించిన తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు.

*** మనసుతో ఎలా వినాలో నేర్చుకున్నా..**

భారత్ జోడో యాత్రలో నేను లోతైన పాఠాలు నేర్చుకున్నాను. యాత్రలో వేల మంది మాతో చేరారు. నడవడం, వినడంపైనే పాదయాత్రలో దృష్టి సారించా. రోజులు గడిచేకొద్దీ మాట్లాడటం, ఆలోచించడం ఎలాగో నాకు తెలిసినప్పటికీ.. నేను ఇంతకు ముందెప్పుడూ పూర్తిగా లీనమై వినలేదని గ్రహించగలిగాను. పాదయాత్ర సాగుతున్నా కొద్దీ నేను మాట్లాడటం తగ్గిపోయింది. ప్రజలు చెప్పేది క్షుణ్ణంగా వినడం అలవాటైంది. సంభాషణలకు కొత్త అర్థం తెలిసింది. చెవులతోనే కాదు మనసుతో వినడమెలాగో నేర్చుకున్నా. వాస్తవానికి ప్రజలకు ఏం చేయాలో తెలుసు. వారి సమస్యలను పరిష్కరించే సామర్థ్యమున్న నేతలుగా మనం మాత్రం... వారు చెప్పేది వినడంలో విఫలమవుతున్నామని అనిపించింది. వారు చెప్పేది మనసుపెట్టి వినాలి తప్ప వారికి ఉపన్యాసాలు ఇవ్వకూడదని నాకు అర్థమైంది.

*** ప్రజలతో నిజమైన అనుబంధం ఉండాలి**

'2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నా. కానీ, ప్రజలతో ప్రేమను వ్యక్తపరచలేకపోయా. పాదయాత్రకు ముందు ప్రజలను కలిసినప్పుడు ఆప్యాయతతో మెలిగేందుకు ఇబ్బందిగా అనిపించేది. పాదయాత్రలో నన్ను కలిసిన ప్రజలతో ప్రేమగా మెలగడం అలవాటు చేసుకున్నా. అలా చేయడం ప్రారంభించిన తర్వాత అసాధారణ మార్పు గమనించా. ప్రజలు నాతో ఎక్కువగా మమేకం అవుతున్నారని అర్థమైంది. అప్పుడు ప్రజలతో కలవడం సులభమైపోయింది. ప్రస్తుతం సమావేశాల్లోనే కాకుండా బహిరంగ సభల్లోనూ ప్రజలు నా దగ్గరికి వచ్చి ఆప్యాయంగా పలకరిస్తున్నారు. భారత్ జోడో యాత్ర క్రమంలో నేను 'నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కా దుకాణ్(విద్వేషపు విపణిలో ప్రేమ దుకాణం)' తెరిచా. ఎవరెంత ద్వేషం వ్యాపింపజేసినా ప్రేమ, ఆప్యాయతలు అంతకన్నా శక్తిమంతమైనవి. ప్రజలు చెప్పేది వినడం, ప్రేమించడంతోపాటు వారితో నిజమైన అనుబంధాన్ని కలిగిఉండాలి'' అని రాహుల్ గాంధీ అన్నారు. అంతకుముందు భారత్ సమ్మిట్‌లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు చేరుకున్న రాహుల్ గాంధీకి శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు తదితరులు సాదర స్వాగతం పలికారు. సమ్మిట్‌లో పాల్గొన్న అనంతరం దిల్లీ తిరిగి వెళ్లిపోయే సమయంలో నాయకులు వీడ్కోలు పలికారు.

# గులాబీ రజతోత్సవ సంబురం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యనాయకులు ప్రభుత్వంపై పోరాటంలో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు దగ్గరయ్యేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. రజతోత్సవ బహిరంగసభ భారాస మళ్లీ తన వైభవాన్ని పొందడానికి ఓ మైలురాయి కాగలదని పార్టీ నేతలు ఆశిస్తున్నారు.

**ఆది నుంచీ వ్యూహాత్మకంగానే..**

తెరాస రాజకీయ ప్రస్థానంలో కేసీఆర్ ప్రతి అడుగూ వ్యూహాత్మకంగానే సాగింది. 2001లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి.. తిరిగి సిద్దిపేట నుంచి గెలుపొంది తెలంగాణ భావ వ్యాప్తికి బీజం వేశారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వంటి మేధావుల సహకారంతో.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఉద్యమ పార్టీగా తెరాస గుర్తింపు పొందింది. 2014లో రాష్ట్రాన్ని సాధించేదాకా అనేక రాజకీయ ఎత్తుగడలతో ఉద్యమాన్ని నడిపింది. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని పోటీ చేయడమే కాకుండా ప్రభుత్వంలోనూ చేరింది. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ఆందోళనల ద్వారా ఒత్తిడి పెంచింది. 2009 ఎన్నికల్లో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకొని పోటీ చేసింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, తెలంగాణ కోసం రాజకీయ జేఏసీ ఏర్పాటు, కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటించడం, 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ పార్లమెంటు చట్టం చేయడంతో ఉద్యమ దశ ముగిసింది.

**పునరుత్తేజం కల్పించే దిశగా..**

తెరాసతో పాటు కాంగ్రెస్, భాజపా, సీపీఐ ఇలా అన్ని ప్రధాన పార్టీలు తెలంగాణ రాష్ట్రం కోసం ఆయా పార్టీల నేతలపై ఒత్తిడి పెంచాయి. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమ పార్టీగా తెరాసకే రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారు. రెండోసారి 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన తెరాస.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక స్థానాలను కోల్పోయింది. ఈ ఎన్నికలకు ముందే మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో విస్తరించడానికి ప్రత్యేక కమిటీలు నియమించడం, సభలు ఏర్పాటు చేయడం ద్వారా జాతీయ పార్టీగా రూపాంతరం చెందేందుకు తెరాస.. భారాసగా మారింది. తర్వాత జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోవడం పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే కొద్ది రోజులకే పార్టీ నాయకత్వం ప్రత్యేకించి.. కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు ప్రభుత్వ విధానాలపై పోరాటంలో నిమగ్నమయ్యారు. అంశాల మేరకు ప్రత్యేక వ్యూహంగా పర్యటించడం, ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం ద్వారా తమ పార్టీ యంత్రాంగాన్ని చురుగ్గా ఉంచే ప్రయత్నం చేశారు. రజతోత్సవ సభకు సన్నాహకంగా ఇప్పటికే కేసీఆర్ అన్ని జిల్లాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. కేటీఆర్, హరీశ్‌రావులు పలు నియోజకవర్గాల్లో పర్యటించి శ్రేణులను సన్నద్ధం చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు కూడా పలు నియోజకవర్గాల్లో పాల్గొన్నారు.

# ముగిసిన పోప్ అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)

పవిత్ర పేటికను ఆశీర్వదించి సమాధిలోకి జారవిడిచారు. అట్టడుగు వర్గాల కోసం నిరంతరం తపించి 'ప్రజా పోప్'గా అందరి మన్ననలు పొందిన పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహ సందర్శన శుక్రవారం రాత్రి ముగిసింది. మరుసటి ఉదయం ఆయన దేహంతో కూడుకున్న పేటికను సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు తీసుకొచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రార్థనా కార్యక్రమంలో వివిధ దేశాల అధినేతలు, అభిమానులు, క్యాథలిక్‌లు పాల్గొన్నారు. అనంతరం పేటికను ఓపెన్ టాప్ వాహనంలో ఊరేగించారు. రహదారికి ఇరువైపులా లక్షల మంది నిల్చుని అంతిమ నివాళులర్పించారు. పోప్ ఫ్రాన్సిస్ చివరి కోరిక మేరకు వాటికన్‌కు వెలుపల రోమ్‌లో ఉన్న సెయింట్ మేరీ మేజర్ బసిలికాకు తీసుకెళ్లారు. అక్కడ పోప్ ఫ్రాన్సిస్ దేహం నిక్షిప్తమైన పేటికకు ప్రవాసులు స్వాగతం పలికారు.

# చెయ్యాల్సింది చాలా ఉంది..

(మొదటిపేజీ తరువాయి)

మీరు మీ అనుభవం, పరిజ్ఞానాన్ని మాతో పంచుకోండి. మీరే తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారి రాష్ట్రం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటండి. మూసీనది పునరుజ్జీవంతో హైదరాబాద్‌కు కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేస్తున్నాం. భవిష్యత్తులో మూసీ నది హైదరాబాద్ నగరానికి అతిపెద్ద ఆకర్షణగా మారి వేల మందికి ఉపాధి కల్పిస్తుంది. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలతో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. 370 కిలోమీటర్ల పొడవైన రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో రైలు విస్తరణ చేపడుతున్నాం.

**ఆదాయం పెంచి పేదలకు పంచడమే లక్ష్యం**

ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి పేదలకు పంచడమే మా విధానం. సంస్కరణల అమలులో పారదర్శకంగా, క్రియాశీలకంగా ఉన్నాం. త్వరలో గిగ్ వర్కర్స్ పాలసీకి రూపకల్పన చేస్తాం. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాం. మంత్రులకు, సీఎంకు కూడా ప్రజలు నేరుగా సమస్యలు తెలిపేలా ఈ వ్యవస్థను ఏర్పాటుచేశాం. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో దశాబ్దాలపాటు పోరాడాం. విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి నాయకత్వం వహించారు. వారి పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా తొలి పదేళ్లు ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. ఆ పరిస్థితుల్లో వారు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు. సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యంగా విద్యార్థులు, యువత, రైతులు, మహిళలు, అణగారిన కులాల ఆకాంక్షలు నెరవేర్చడం మా కర్తవ్యం. గత ఆగస్టులో రూ.20,617 కోట్లు చెల్లించి 25.5 లక్షల మంది రైతులకు రుణ విముక్తి కల్పించాం. భారతదేశంలోనే అతిపెద్ద రుణమాఫీ ఇది. రైతులకు 24 గంటలూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. రైతు భరోసా పేరుతో ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం చేస్తున్నాం. భూమిలేని రైతు కూలీలకు ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.12,000 సాయం ఇస్తున్నాం. భూమిలేని కూలీలకు, భూమి కలిగిన రైతులకు కలిపి ఏటా రూ.20,000 కోట్లకు పైగా ఇస్తున్నాం. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నాం. 5 లక్షల మంది యువతకు ప్రయోజనం కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించాం.

**విద్య, వైద్యం, ఉపాధికి తొలి ప్రాధాన్యం**

విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. దావోస్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లలో జరిగిన పెట్టుబడుల సదస్సులకు హాజరయ్యాం. ప్రైవేటు రంగంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టాం. మా ప్రభుత్వంలో మహిళలు, రైతులు, యువతే ప్రధాన భాగస్వాములు. రాష్ట్రంలో 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చూడాలన్నదే మా లక్ష్యం. సౌరవిద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ విద్యుత్ బస్సులు, పెట్రోల్ బంకులకు మహిళలను యజమానులను చేశాం.

# పదేళ్లలో అన్ని రంగాల్లో పెనుమార్పులు

(మొదటిపేజీ తరువాయి)

'ఆంధ్రప్రదేశ్‌లో వైద్యరంగం బలంగా ఉంది. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో చదువుకుని విదేశాలకు వెళ్లిన వైద్యులెందరో ఉన్నారు. మొదట్లో బ్రెయిన్ డ్రెయిన్‌గా ఉన్నా భవిష్యత్తులో బ్రెయిన్ గెయిన్‌తో తిరిగి వస్తారని చెప్పా. ప్రతాప్‌రెడ్డి వంటి వైద్యులు అపోలో, ఇతరాలు పెట్టి దేశానికి వైద్యరంగంలో కార్పొరేట్ సేవలందించవచ్చని నిరూపించారు. ఎవరు ఏ కోర్సు చేసినా ఐటీ పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలి. ఐటీపై అవగాహన ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు. వైద్య కళాశాల విద్యార్థులకూ టెక్నాలజీ ముఖ్యమే' అని అన్నారు. విశాఖ ఆంధ్ర వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థులు రూ.50 కోట్లతో నిర్మించిన 'శతాబ్ది అలుమ్ని' భవనాన్ని సీఎం శనివారం ప్రారంభించారు. అనంతరం సభలో మాట్లాడారు. 'ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు గతంలో మ్యాచింగ్ గ్రాంట్ అడిగితే మా ప్రభుత్వంలో అంగీకరించాం. తరువాత వైకాపా ప్రభుత్వం ఈ నిధులివ్వకుండా ఇబ్బంది పెడితే పట్టువదలని విక్రమార్కుల్లా పనిచేశారు. రూ.50 కోట్ల విరాళాలు సేకరించి భారీ భవనం నిర్మించడం చరిత్ర' అని ప్రశంసించారు.

**ఒకరికొకరు స్ఫూర్తిగా..**

'చదివిన కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకొస్తున్నారు. ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు ఇందుకు నాంది పలికారు. మరో రూ.20 కోట్లతో బయోమెడికల్ రీసెర్చ్ ల్యాబ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గుంటూరు వైద్య కళాశాలలో రూ.వంద కోట్లతో 500 పడకల ప్రసూతి, శిశు ఆరోగ్య బ్లాక్‌లను నిర్మిస్తున్నారు. ఇతర వైద్య కళాశాలల విద్యార్థులు సైతం స్ఫూర్తినిచ్చేలా ముందుకెళుతున్నారు' అని సీఎం ప్రశంసించారు. 'అభ' ఐడీ రూపొందించి వందశాతం డిజిటల్ రికార్డుల దిశగా అడుగులు వేస్తున్నాం. టాటాతో ఒప్పందం చేసుకుని 'హెల్త్ నర్వ్ సెంటర్' రూపొందిస్తాం. వైద్య సిబ్బంది నుంచి రోగుల వరకు వివరాలు ఆన్‌లైన్ చేయాలని భావిస్తున్నాం. వైద్యానికి సంబంధించి కుప్పంలో ప్రాజెక్టు చేస్తున్నాం. తర్వాత చిత్తూరు, రాష్ట్రమంతా చేస్తాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అదే గేమ్ ఛేంజర్ అవుతుంది..**

'ఆసుపత్రుల్లో వైద్యంకంటే వసతికి ఎక్కువ ఖర్చవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టబోయే ప్రయోగాత్మక కార్యక్రమానికి ఆంధ్ర వైద్య కళాశాల మోడల్‌గా నిలిచి సహకరించాలి. ఒకే రకమైన సమస్యలతో బాధపడే రోగుల సమాచారముంది. ఈ వివరాల ఆధారంగా పది వ్యాధులపై కసరత్తు చేసి విదేశీ నిపుణులను సంప్రదించి.. మీ ఆలోచనలు జోడించి వైద్య ఖర్చులు తగ్గించగలిగితే ఇది పెద్ద గేమ్‌ఛేంజర్ అవుతుంది' అని సీఎం పిలుపునిచ్చారు.

# బాంబు పేలుళ్లు, కాల్పుల మోతతో దద్దరిల్లుతున్న కర్రెగుట్టలు

చర్ల, వెంకటాపురం: దాదాపు 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో 'బ్లాక్ హిల్స్'గా పేరొందిన కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు ఐదో రోజు కూంబింగ్ కొనసాగించాయి. సాయంత్రం 4 గంటలు కాగానే చీకటి పడటం.. 5 అడుగుల దూరంలో మనిషి కూడా కనిపించనంత దట్టమైన అడవి ఉండటంతో ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు తమకు అత్యంత సురక్షితంగా భావిస్తారు. ఇలాంటి చోట ఆపరేషన్ బలగాలకు కత్తిమీద సాముగా మారింది. శుక్రవారం రాత్రి కర్రెగుట్టల ప్రాంతం బాంబుల శబ్దాలు, కాల్పుల మోతతో కల్లోలంగా మారిందని చుట్టుపక్కల గిరిజనులు చెబుతున్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి నాలుగు హెలికాప్టర్లు నిరంతరం చక్కర్లు కొడుతున్నట్లు తెలిపారు. గల్గం అడవుల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి ఒక డీఆర్‌జీ జవాన్‌కు గాయాలు కాగా బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దును కేంద్రంగా చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గంలో ప్రధానంగా ఆపరేషన్ కొనసాగుతోంది. రుద్రారం వరకు 90 కి.మీ. పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అతి కష్టం మీద శనివారం సాయంత్రం కొంతమేరకు ఎక్కగలిగిన బలగాలు మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న సొరంగాన్ని గుర్తించాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను, ఆయుధాలను, పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. శనివారం భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందినట్లుగా విస్తృత ప్రచారం సాగినప్పటికీ అధికారులు నిర్ధారించలేదు.

**చురుగ్గా ఎఫ్ఓబీ ఏర్పాటు పనులు**

కర్రెగుట్టల అభయారణ్యంలో ఎఫ్ఓబీ(ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్)ల ఏర్పాటు ప్రక్రియ దూకుడుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. నక్సల్స్‌కు కంచుకోటగా ఉన్న అబూజ్‌మడ్‌ను వీటితోనే ఛిన్నాభిన్నం చేశారు. అదే తరహాలో ఇక్కడా ఎఫ్ఓబీలు నెలకొల్పి మావోయిస్టులను నిలువరించాలని ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఈ గుట్టలకు సమీపంలో ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీమారంపాడు, పూజారికాంకేర్, నంబి, గల్గం, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూసుగుప్పలో బేస్ క్యాంపులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కర్రెగుట్టలకు అనుబంధంగా ఉన్న పామునూరు, తడపల, పెనుగోలు ప్రాంతాల్లో వాటి ఏర్పాటు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# ఏసీబీ వలలో రూ. 100 కోట్ల తిమింగలం!

హైదరాబాద్, రాయదుర్గం, ములుగు, లక్ష్మీదేవిపల్లి: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో ముఖ్య భూమిక పోషించిన నీటిపారుదల శాఖ గజ్వేల్ ఈఎన్‌సీ భుక్యా హరిరామ్‌ను అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) అరెస్టు చేసింది. భారీగా అక్రమాస్తులు కూడబెట్టారనే అభియోగాల నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి సోదాలు చేపట్టిన ఏసీబీ.. సాయంత్రం అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించింది. శనివారం రాత్రి వరకూ గుర్తించిన అక్రమాస్తుల విలువ సుమారు రూ.100 కోట్లకు పైగా ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నందున మరిన్ని అక్రమాస్తులు బయటపడే అవకాశముందని, అక్రమాస్తుల వాస్తవ విలువ భారీగా ఉంటుందని ఏసీబీ వివరించింది.

**విల్లాలు, స్థలాలు, పొలాలు..**

హరిరామ్‌కు భారీగా అక్రమాస్తులున్నట్లు ఏసీబీ తనిఖీల్లో బయటపడింది. షేక్‌పేట, కొండాపూర్‌లో రెండు విల్లాలు, శ్రీనగర్, నార్సింగి, మాదాపూర్‌లో మూడు ఫ్లాట్లు, ఏపీ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ నివాసాలు, బొమ్మలరామారంలో ఆరు ఎకరాల్లో ఫామ్‌హౌస్.. మామిడితోట, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, మిర్యాలగూడలో ఖాళీ స్థలం, రెండు కార్లు (ఒకటి బీఎండబ్ల్యూ), బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు గుర్తించారు. 14 ప్రాంతాల్లో తనిఖీలు: హరిరామ్ నివాసాలు, కార్యాలయాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి ఏసీబీ సోదాలు మొదలయ్యాయి. షేక్‌పేటలోని ఆదిత్య రాయల్ ఫామ్‌లోని హరిరామ్ విల్లాకు చేరుకున్న ఏసీబీ అధికారుల బృందం తనిఖీలు మొదలుపెట్టింది. దీనికి సమాంతరంగా రాష్ట్రంలోని 14 ప్రాంతాల్లో సోదాలు కొనసాగాయి. జలసౌధ మొదటి అంతస్తులోని ఈఎన్సీ కార్యాలయం, కాళేశ్వరం సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు కార్పొరేషన్ కార్యాలయంలో కొన్ని బృందాలు తనిఖీ చేశాయి. మూడు ఆస్తులకు చెందిన పన్ను రసీదులు, పలు ధ్రువపత్రాలు, వ్యక్తిగత రుణాలకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు తెలిసింది. వీటితోపాటు పలు దస్త్రాలను సీజ్ చేసి అనిశా కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.

# నిష్పాక్షిక విచారణకు సహకరిస్తాం

ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఘటనపై పాక్ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగారు. తమను అనవసరంగా ఆడిపోసుకోవద్దని, విచారణను నిష్పాక్షికంగా నిర్వహిస్తే సహకరిస్తామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పారు. (భారత్) దుస్సాహసానికి ఒడిగడితే ఎలా రక్షించుకోవాలో తమకు తెలుసునన్నారు. హిందువులు, ముస్లింలు ఏ విధంగానూ ఒక్కటి కాదని, రెండుదేశాల సిద్ధాంతమే మేలని పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ మరోసారి వివాదాస్పదంగా మాట్లాడారు. సింధు జలాలు తమకు రాకుండా అడ్డుకుంటే రక్తం ఏరులై పారుతుందని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఛైర్మన్ బిలావల్ భుట్టో హెచ్చరించారు. శనివారం వీరంతా ఈ మేరకు స్పందించారు. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్సులో 'పాకిస్థాన్ మిలిటరీ అకాడమీ' (పీఎంయే) శిక్షణార్థుల పాసింగ్‌అవుట్ పరేడ్‌ను ఉద్దేశించి షెహబాజ్, మునీర్ ప్రసంగించారు. సింధు ప్రావిన్సులోని సుకుర్‌లో బహిరంగ సభలో భుట్టో మాట్లాడారు. తాజా ఉగ్రదాడి ఘటనలో పాక్ ప్రమేయమే లేదని చెప్పేందుకు, తిరిగి భారత్‌పై బురద జల్లేందుకు వీరంతా ప్రయత్నించారు.

**మా సైన్యానికి సత్తా ఉంది**

పహల్గాంపై ఒక బాధ్యతాయుత దేశంగా తటస్థ, పారదర్శక, విశ్వసనీయ విచారణకు సహకరిస్తామని షెహబాజ్ చెప్పారు. ''ఈ ఘటనలో మనపై వేస్తున్న నిందల్ని ఆపాలి. సింధు జలాల పంపిణీ ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రయత్నించినా, పాక్‌కు రావాల్సిన నీటి ప్రవాహాన్ని అడ్డుకోవాలని చూసినా దానికి పూర్తిస్థాయిలో దీటుగా బదులిస్తాం. ఎలాంటి దుస్సాహసం ఎదురైనా దేశంలో ప్రతి అంగుళాన్ని కాపాడుకోగల సత్తా పాక్ సైన్యానికి ఉంది. శాంతికే మన ప్రాధాన్యం. దానిని బలహీనతగా పరిగణించకూడదు. ఉగ్రవాదుల వల్ల 90 వేల మందిని పాక్ కోల్పోయింది. విశ్వసనీయ విచారణ జరపకుండా, పక్కా ఆధారాల్లేకుండా భారత్ మనపై ఆరోపణలు చేస్తోంది'' అని షెహబాజ్ ఆక్రోశం వెళ్లగక్కారు.

**రెండు దేశాల సిద్ధాంతమే పరిష్కారం**

అసీం మునీర్ మాట్లాడుతూ హిందువులు, ముస్లింలు పూర్తిగా భిన్నమైనవారని, రెండు దేశాల సిద్ధాంతమే దానికి పరిష్కారమని అభిప్రాయపడ్డారు. ''ముస్లింలు హిందువులు వేర్వేరు. మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు.. వీటన్నింటిపరంగా హిందువులకంటే ముస్లింలు వేరు. అందుకే రెండు దేశాల సిద్ధాంతానికి బీజం పడింది. మనవి వేర్వేరు దేశాలు. అనేక త్యాగాల తర్వాత పాకిస్థాన్‌ను సాధించుకున్నాం. దానిని సురక్షితంగా ఉంచడం సైనికుల బాధ్యత. తాతముత్తాతల త్యాగఫలాన్ని ఎలా కాపాడుకోవాలో మనకు తెలుసు'' అని అన్నారు.

**నీరు వదలకపోతే రక్తం పారుతుంది**

సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ వెనక్కు తీసుకోవడంపై బిలావల్ భుట్టో నోరు పారేసుకున్నారు. సింధూ నీటిని ఆపేస్తే నదుల్లో రక్తం పారుతుందన్నారు. ''సింధూ నది పాకిస్థాన్‌ది. ఎప్పటికీ మాదే. ఇందులో నీరైనా పారుతుంది లేదా వారి (భారత్) రక్తం ప్రవహిస్తుంది'' అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. పాకిస్థాన్ నుంచి సింధూ జలాలను వేరు చేయాలని చూసే మోదీ ప్రయత్నాలను పాకిస్థాన్, అంతర్జాతీయ సమాజం సహించవని అన్నారు.




## వంజరి కులస్తుల సమాలోచన సభను జయప్రదం చేయండి

అంబర్ పేట, ఏప్రిల్, 26, (సమయం న్యూస్): సమాజంలో ఎంతో వెనుకబాటుకు గురవుతున్న వంజరి కులస్తుల సమస్యలపై "సమాలోచన" సమావేశం రేపు ఉదయం 10:00 నుండి తార్నాకలోని రాష్ట్ర సంఘ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథం తెలిపారు. సికింద్రాబాద్లో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వంజరి కులస్తులకు ఆత్మగౌరవ భవన నిర్మాణం కేటాయించి ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడం ఎస్టీ రిజర్వేషన్ అంశం, కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కులస్తులకు రాజకీయంగా ప్రాతినిధ్యం దక్కాలనే అంశంపై ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వంజరి కులస్తులలోని విద్యావంతులు మేధావులు ఉద్యోగులు ఉపాధ్యాయులు వివిధ రిజిస్టర్ సంఘాల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వంజరి కుల రాష్ట్ర నేతలు దాత్రిక కాశీనాథ్ లవంగు ఆంజనేయులు కాలేరు యుగంధర్, దాత్రిక ధర్మరాజు రిటైర్డ్ డిఎస్పి శివప్రసాద్ దాత్రిక ధర్మ రవీందర్ క్యాదరి నర్సింగరావు అముద లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాలురా మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

* **లబ్ధిదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కృషికి కృతజ్ఞతలు**

సాలురా మండల కేంద్రం, ఏప్రిల్ 26 సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా సాలురా మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ నాయకులు సాలురా మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. చెక్కులు మంజూరు కావడంలో ముఖ్యపాత్ర పోషించిన



ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ & సాలురా మండల కాంగ్రెస్ అధ్యక్షులు డి. నాగేశ్వర్ రావు, మందర్న రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై. నరేందర్ రెడ్డి, బోధన్ ఏఎంసీ చైర్మన్ శీల శంకర్, సాలురా పిఎసిఎస్ చైర్మన్ అల్లే జనార్ధన్, ఏఎంసీ డైరెక్టర్ భూమయ్య, జాడి దేవదానం, కుమ్మన్‌పల్లి నరేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లబ్ధిదారుల్లో ఆనందం నింపింది.

## సెలవులకు ఊరెళ్తున్నారా.. జరభద్రం!

* **ప్రయాణాలు చేసేవారు పోలీస్ వారికి సమాచారం అందించండి**
* **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచన**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(సమయం న్యూస్): వేసవి కాలం సెలవులు ప్రారంభంతో చాలా మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఇంటిని వదిలి దూర ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సూచించడం జరిగింది. వేసవి సెలవుల దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అయన పలు సూచనలు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలన్నారు. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని




గమనిస్తూ ఉండమని మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు చెప్పడం మంచిదన్నారు. విలువైన వస్తువుల సమాచారాన్ని వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఇంట్లో బంగారు నగలు నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలి. బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం అన్నారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100 నకు ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.



## అధికారులకు ప్రజల సమస్యలపై వ్యక్తిగత దరఖాస్తులు

* **అందించిన సిపిఎం ప్రతినిధులు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(సమయం న్యూస్): మున్సిపాలిటీ పలు వార్డుల్లో ప్రధాన సమస్యలపై వ్యక్తిగత దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ సుజాత రెవిన్యూ అధికారి సూర్యనారాయణలకు సిపిఎం ప్రతినిధులు శనివారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మున్సిపాలిటీలో ప్రధాన సమస్యలైన మంచినీరు డ్రైనేజీ ఇల్లు ఇళ్ల స్థలాలు సమస్యలు అధికారులకు వివరించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ పది రోజుల్లో కిన్నెరసాని మంచినీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ నాయకులు నందిపాటి రమేష్ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుపరచాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(సమయం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ యువ వికాసం భూభారతి చట్టంలను సమర్థవంతంగా అమలు పరచాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎంపిక రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన భూభారతి చట్టం జల్ సెంచెయ్ జన్ భాగి దారి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు పాము పొండ్స్ నిర్మాణం త్రాగునీటి సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన వేగవంతం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లకు గాను ఇప్పటికే మొదటి విడతలో మండలానికి ఒక గ్రామపంచాయతీ ఎంపిక చేసి ఉన్నారని మిగిలిన గ్రామపంచాయతీలలో లబ్ధిదారుల అర్హుల జాబితా క్షేత్రస్థాయిలో పర్యటించి త్వరితగతిన పూర్తి చేయాలని




ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తమ వద్దకు వచ్చిన జాబితాను సంబంధిత మండలాల ఎంపీడీవోలు లేదా మున్సిపల్ కమిషనర్లకు అందజేసి వారు స్థానికంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పంచాయతీ సెక్రటరీలతో సమన్వయం పరచుకొని ఉన్న జాబితాలో పేదల్లో నిరుపేద వారిని గుర్తించి అర్హుల జాబితా రూపొందించాలన్నారు. జాబితాలో పేరు లేని ఎవరైనా నిరుపేదలు ఉంటే వారి పేర్లు కూడా జత పరిచి అర్హుల జాబితా తయారు చేసి స్థానిక శాసనసభ్యులు సహకారంతో జాబితా రూపొందించాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తులన్నీ త్వరితగతిన పరిశీలన చేపట్టి అర్హుల జాబితా రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను ఆయా కార్పొరేషన్ల వారీగా క్షేత్రస్థాయిలో బ్యాంకర్లతో కలిసి పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలని అన్నారు. రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న వారికి వ్యవసాయ ఆధారిత యూనిట్లు స్థాపన చేసేలా అవగాహన కల్పించాలన్నారు. భూమి ఉన్నవారికి ఆయిల్ పంపు పందుల పెంపకం పాడి పరిశ్రమ పవర్ లోడర్ వంటివి భూమి లేని వారికి చేపల పెంపకం పుట్టగొడుగుల పెంపకం పిండి మిల్లు వంటి యూనిట్లు స్థాపించడం ద్వారా వారికి లాభదాయకంగా ఉంటుందని తెలియచెప్పాలన్నారు. జల్ సెంచెయ్ జన్ భాగీ దారి కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఇంకుడు గుంతలు ఫామ్ పొండ్స్ నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చేపట్టిన నిర్మాణాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి జిల్లాలో అమలులో భాగంగా రెవెన్యూ రికార్డులను సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నాన్ డిఎస్ కారణాలను గుర్తించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ భూ సమస్యల దరఖాస్తులను నివేదిక అందించాలని సూచించారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులు తమ పరిధిలో ఉన్నటువంటి రేషన్ కార్డ్ దరఖాస్తులు పరిశీలన ఎన్నికల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిని పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా త్రాగునీటి సమస్యల పరిష్కారానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పైప్ లైన్ లో లీకేజీ పంపుల మరమ్మత్తులు ప్రాతిపదిక మీద పూర్తిచేయాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నచోట ట్యాంకర్లతో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా సరఫరా చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ త్రాగునీటి సమస్య తలెత్తిన వెంటనే మిషన్ భగీరథ అధికారులు దృష్టికి తీసుకురావాలని వాటిని తక్షణమే వారు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.




## స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహనతో ముందుకు సాగాలి

* **భారతీయ రిజర్వ్ బ్యాంక్ మేనేజర్ సాయి తేజ రెడ్డి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(సమయం న్యూస్): స్వయం సహాయక సంఘాల సభ్యులు స్పష్టమైన ఆర్థిక లక్ష్యాలు కలిగి ఆర్థిక అవగాహనతో ముందుకు సాగాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ మేనేజర్ సాయి తేజ రెడ్డి అన్నారు. అస్పిరేషనల్ బ్లాక్ అయిన గుండాల మండలం కాచనపల్లిలో జరిగిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆర్థిక ప్రణాళిక పొదుపు వివిధ రకాల పెట్టుబడి సాధనాలు బ్యాంక్ లావాదేవీలు బ్యాంకింగ్ ఓంబుడ్స్ మెన్ ఆన్లైన్ మోసాల నుండి రక్షణ స్వయం ఉపాధి పథకాల సద్వినియోగం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, ఎస్.బి.ఐ కాచనపల్లి మేనేజర్ వేణు, ఎ.పి.ఎం కోటేశ్వర రావు, సిసి సి.ఎఫ్.ఎల్ కౌన్సిలర్లు నాగేశ్వర రావు, జగ్య, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోండి

* **జిఎం(పర్సనల్) వెల్ఫేర్ కవిత నాయుడు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(సమయం న్యూస్): సింగరేణి ఆధ్వర్యంలో జరిగే సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఐఆర్ అండ్ పిఎం కవిత నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక సింగరేణి ప్రకాశం స్టేడియంలో సింగరేణి కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు పరిసర ప్రాంత 18 సంవత్సరాలలోపు బాల బాలికలకు అథ్లెటిక్స్ బాస్కెట్ బాల్ బాక్సింగ్ ఫుట్ బాల్ వాలీబాల్ ఉషు/కరాటే డ్రాయింగ్ మొదలగు వివిధ క్రీడా విభాగాలలో వచ్చేనెల 20వ తేదీ వరకు జరిగే ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం జిఎం(పర్సనల్) వెల్ఫేర్ కవిత నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల బాలికలు ఎంతో విలువైన ఈ వేసవి సెలవులను వృధా చేయకుండా మానసిక ఉల్లాసానికి సృజనాత్మకు శారీరక ధృడత్వానికి ఎంతో ఉపయోగపడే ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వేసవి శిక్షణా శిబిరంలో అనుబవజ్ఞులైన శిక్షకులచే అథ్లెటిక్స్ బాక్సింగ్ ఫుట్ బాల్ బాస్కెట్ బాల్ వాలీబాల్ ఉషు/కరాటే క్రీడా శిక్షణ ప్రతి రోజు ఉదయం 6.00 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 గంటల 7 గంటల వరకు డ్రాయింగ్ శిక్షణ ఉదయం 7 గంటల నుండి 8.30 గంటల వరకు నిర్వహించ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజిటఎం(పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, గుర్తింపు సంఘం (ఏఐటింయూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.పితాంబరరావు, కార్పొరేట్ సిఎంఓఏఐ సెక్రటరి ఆర్.కేశవరావు, సీనియర్ పిఓ అండ్ స్పోర్ట్స్ మేనేజర్, హనరరీ సెక్రటరి టి.శ్రీనివాస రావు, మేనేజ్మెంట్ ట్రైనీ (పర్సనల్) కె.ఉదయ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి. పోస్ నెట్, వెల్ఫేర్ పిఎ వరప్రసాదరావు, శిక్షకులు, బాల బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మే 4న జిల్లాలో నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలి

*** జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26 సమయం న్యూస్: జిల్లాలో మే 4వ తేదీన నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఎసిపి ప్రకాష్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మే 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో జరగనున్న నీట్ పరీక్షకు 1 వేయి 204 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఇందుకు గాను జిల్లాలో 4 పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల, రాజీవ్ నగర్, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మే 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుండి



సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కంట్రోల్ రూమ్, పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రశ్నా పత్రాలను పూర్తి బందోబస్తుతో భద్రపర్చడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144, 163 సెక్షన్లు అమలు చేయడం జరుగుతుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాల రవాణా జరుగుతుందని, ఇందుకు గాను పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, పరీక్ష రోజున ఉదయం 9 గంటల లోపు ప్రశ్నాపత్రాలు కంట్రోల్ రూమ్ లో ఉంచాలని, నీట్ పరీక్ష విషయాలకు సంబంధించి ఎలాంటి పరిజ్ఞానం లేని ఇన్విజిలేటర్లను నియమించాలని, తదనుగుణంగా ఇన్విజిలేటర్ల జాబితా రూపొందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి మొబైల్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని, ప్రతి అభ్యర్థిని పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, మహిళా అభ్యర్థుల పరిశీలన కొరకు మహిళా సిబ్బందిని నియమించాలని తెలిపారు. పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాల తరలింపు నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. 4 పరీక్షా కేంద్రాలలో ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి ఒక ముఖ్య పర్య వేక్షకుడు, పాలనా విభాగం నుండి ఒక నోడల్ అధికారి, పోలీసుశాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించి, ఓఆర్ఎస్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి అధికారులు బస్సులు నడిపించాలని, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా పరీక్షా కేంద్రంలోనికి ఎవరికి అనుమతి ఉండదని తెలిపారు. దివ్యాంగుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలలో వీల్చైర్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో నీట్ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ ప్రసాద్, వైద్యఆరోగ్యశాఖ, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ సద్వినియోగం చేసుకోవాలి

**- డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

గజ్వేల్, ఏప్రిల్ 26: ముఖ్యమంత్రి సహాయనిదిని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని డిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ కు చెందిన భూషన్నగరి రామకృష్ణ గౌడ్ కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 60,000 చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని, అనారోగ్యంతో బాధపడే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండి షరీఫ్ వుడెం శ్రీనివాస్ రెడ్డి, ఈదగాని శివులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 1 వేయి 493 మంది రైతుల ఖాతాలలో 35 లక్షల రూపాయలు జమ

*** జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26 సమయం న్యూస్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఇప్పటి వరకు 1 వేయి 493 మంది రైతుల వద్ద నుండి 12 వేల 74 మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 35 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## తన స్వంత నిధులనుండి శివంపేట గ్రామా అభివృధే తన ధ్యేయంగా
# పని చేస్తున్న ప్రముఖ సంఘ సేవకులు

*** తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా**



శివంపేట ఏప్రిల్ 26 (సమయం న్యూస్) : మండల కేంద్రమైన శివంపేటలో తూప్రాన్ నర్సాపూర్ ప్రధాన రహదారినుండి శివంపేట గ్రామంలోకి వెళ్లే ప్రధాన లింక్ రోడ్ పూర్తిగా ఆసౌకర్యంగా ఉండటం వలన గ్రామా ప్రజలు తీవ్ర ఇబందులకు గురిఅవుతున్నారని తన అనుచరుల ద్వారా తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా వెంటనే స్పందించి తన స్వంత నిధులతో అప్పటికప్పుడు జేసీబీ, డోజర్, మరియు టిప్పర్లతో మెటిరియల్ తెపించి రోడ్ మరమ్మతు చేపించడం జరిగిందిఇట్టి కార్యక్రమంలో భాగంగా పబ్బ మహేష్ గుప్తా మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం కూడా మండల ప్రజల సౌకర్యం నిమిత్తం పెద్ద చెర్వు కట్ట కూడా తన స్వంత నిధులతోని మరమ్మతు చేయడం జరిగింది. ఈరోజు శివంపేట ప్రజల కోరిక మేరకు అప్పటికప్పుడు శివంపేట ప్రధాన రోడ్ నుండి గ్రామంలోకి వచ్చే ప్రధాన రోడ్ అసౌకర్యంగా ఉందని ప్రజలకు ఇబంది జరుగుతుందని తన స్వంత ఖర్చులతో మరమ్మతు చేపించడం జరిగిందిఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, తాజా మాజీ ఉప్ప సర్పంచ్ పద్మా వెంకటేష్, తెరాస గ్రామశాఖ అధ్యక్షులు లక్ష్మి నర్సయ్య, మాజీ వార్డు సభ్యులు పోచగౌడ్, కొండల్, సింహం, వెంకటేష్,లక్ష్మి నారాయణ, రాజు,కృష్ణ,సంతోష్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బసంపల్లి రామా గౌడ్ పిఎంజి యువసేన సభ్యులు అశోక్, త్రినేష్‌గౌడ్, గొండ స్వామి,అర్జున్, మలేష్, సత్యానారాయణ,శ్రీను, వెంకటేష్, శ్రీకాంత్, శ్రీను, కుమార్ ,నాగరాజు, బలరాం, సురేష్,మహేష్, నవీన్, సుదర్శన్ గౌడ్, వెంకటేష్,రవి, నర్సింలు, తిరుపతి,వేణు,చారి,శామ్,హరి,సాయి, తదితరులు పాల్గొన్నారు. గ్రామప్రజలు పబ్బ మహేష్ గుప్తా ను గ్రామంకోసం చేస్తున్న సేవలు అభినందనీయం అని కొనియాడారు



## నర్సాపూర్ జాతీయ రహదారి పై ఘోర రోడ్డుప్రమాదం

*** మృతుల్లో ఒక చిన్నారి**

నర్సాపూర్ ఏప్రిల్ 26 (సమయం న్యూస్) : మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చింతకుంట గ్రామ సమీపంలో 765 డి జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనం ఢీ కొట్టుకున్నాయి వెనుక నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనదారుల పైనుండి దూసుకుపోవడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు ఇందులో ఒక చిన్నారి ఉన్నది రోడ్డుపై మృతి దేహాలు చిందర వందరంగా పడిపోయాయి మృత్యులు వెంకట్రావు పేట గ్రామస్తులుగా స్థానికులు గుర్తించారు ఘటన స్థలానికి పోలీసులు వచ్చి మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు

# ఆరోగ్యం కోసం మిల్లెట్స్ ఫుడ్

*** మాజీ కౌన్సిలర్ వై.శ్రీనివాస్ రెడ్డి**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26 (సమయం న్యూస్): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు కూలీ లైన్ పాత బస్ డిపో సూర్యోదయ స్కూల్ లైన్ రోడ్ లో ప్రముఖ సంఘ సేవకులు ఉదయ్ ఆధ్వర్యంలో కిరణ్మయి ఆర్గానిక్ మిక్స్ మిల్లెట్స్ స్టోర్ మిల్లెట్స్ ది బెస్ట్ ఫుడ్ సెంటర్ ను శనివారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో బీపీలు షుగర్లు ఇతరత్రా అనేక కారణాలతో ఇబ్బందులు పడు తున్న ప్రతి ఒక్కరు ఇమ్యునైజేషన్ రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు మంచి ఆరోగ్యం కోసం మిల్లెట్స్ ఫుడ్ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు, ఉదయ్ కుటుంబ సభ్యులు మహిళ సోదరీమణులు శ్రేయోభిలాషులు సంఘ సేవకులు తదితరులు పాల్గొన్నారు.



## పహల్గాం అమరుల ఆత్మ శాంతికి కొవ్వొత్తుల ర్యాలీ

గుమ్మడిదల, ఏప్రిల్ 26, సమయం న్యూస్ : జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో తీవ్రవాదుల దుశ్చర్య లో మృతి చెందిన అమరులకు ఆత్మ శాంతి కలగాలని, గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో శని వారం బిజెపి మండల అధ్యక్షుడు ఐలేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్లంకి కళాశాల ప్రిన్సిపల్ అశోక్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పహల్గాం తీవ్రవాదులు చేతుల్లో మర ణించిన మృతుల కుటుంబాలకు భారత ప్రజలందరూ వెన్నంటే ఉండాలని, వారి కుటుంబాలకు భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నాడు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, గంగా గౌడ్, బోసు బాబు, వడ్ల శ్రీనివాస్ చారి, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆంజనేయులు నాయక్, పంకజ్ రోక్కడే, మేడిపల్లి అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

*** రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్తవాలే) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగపిండి రమేష్**




మందమర్రి, ఏప్రిల్ 26 సమయం న్యూస్: జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్తవాలే) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగపిండి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తుంగపిండి రమేష్ మాట్లాడుతూ, భారతీయులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేయడం అత్యంత బాధాకరమని తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వారికి అన్ని రకాల సహాయక సహకారం అందించాలని, చనిపోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షల చొప్పున ఎక్స్గ్రేజ్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఉగ్రవాదులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుడి కందుల తిరుపతి, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి రైమత్ ఖాన్, జిల్లా ఇన్చార్జి పులిపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి , గరిగే వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు భారతపు తిరుపతి, కన్నూరి కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవలే ఏప్రిల్ 21 సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్, నార్నూర్ బ్లాక్ అస్పిరేషనల్ ప్రోగ్రాం 2024 కు గాను ఢిల్లీ లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోది గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అదిలాబాద్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా గారిని DPRO, మీడియా మిత్రులు శనివారం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



## భూ మస్యల పరిష్కారానికి భూ భారతీ

వికారాబాద్ ఏప్రిల్ 26(సమయం న్యూస్) : ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా భూ సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి చట్టం ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

*** జూన్ 2 నుండి రెవెన్యూ సదస్సులు**

జూన్ రెండవ తేదీ నుండి జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లోని ప్రతి భూ సమస్యను తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. జిల్లాలో 10 నెలల క్రితం 15వేల భూ సమస్యల దరఖాస్తులు ఉండే వని, ప్రస్తుతం 5 వేల దరఖాస్తులు మాత్రమే పెండింగ్ లో ఉన్నాయని 3 మాసాల్లో రెవెన్యూ యంత్రాంగం ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని, ప్రజల సహకారం తో త్వరితగతిన భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పాలన అధికారులను నియమించనున్నట్లు అధికారులందరూ నిబద్ధతో పని చేసి సమస్యలు పరిష్కరిస్తారని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న మండల కార్యాలయాల సముదాయ భవనాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా ప్రస్తుత డంపింగ్ యార్డ్ మార్చే నిమిత్తం వేరే స్థలాన్ని పరిశీలించి నిర్ధారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ కిషన్, ఎంపీడీవో రవీందర్ లు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంఎల్ఆర్ఐటి 20వ వార్షిక దినోత్సవం

ఇంజనీరింగ్ విద్యలో ఒక ప్రముఖ సంస్థ అయిన MLR ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,కళాశాల 20వ వార్షిక దినోత్సవ వేడుకలను ఏప్రిల్ 25, 2025న నిర్వహించింది. వార్షిక దినోత్సవం సందర్భంగా ఇన్స్టిట్యూట్ సోలో డ్యాన్స్, గ్రూప్ డ్యాన్స్, స్కిట్ మొదలైన వివిధ కార్యక్రమాలను కూడా నిర్వహించింది. వివిధ ఈవెంట్‌లు, ఆటలు & క్రీడలలో గెలిచిన విజేతలకు ఇన్స్టిట్యూట్ బహుమతులు అందజేసింది. ఈ సందర్భంగా MLRIT వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, MLR ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 2005లో స్థాపించబడిందని, 2015లో



UGC ద్వారా స్వయంప్రతిపత్తి హోదా పొందిందని అన్నారు. MLRIT అనేది తెలంగాణలో స్వయంప్రతిపత్తి పొందిన (అతి తక్కువ సమయంలో) కళాశాల అని, అదేవిధంగా NAAC ద్వారా "A" గ్రేడ్‌తో అక్రిడిటేషన్ మరియు టైర్ I కింద NBA ద్వారా తిరిగి గుర్తింపు పొందింది మరియు వరుసగా NIRF ర్యాంక్‌ను సాధిస్తుందని తెలిపారు.అదేవిధంగా MLRIT 51 LPA బెంచ్‌మార్క్‌ను చేరుకుందని మరియు అర్హత కలిగిన విద్యార్థులపై 90% ప్లేస్‌మెంట్ రికార్డును సాధించిందని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రావు మరియు వ్యవస్థాపక కార్యదర్శి శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి, చైర్మన్ శ్రీ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కోశాధికారి MLRIT మర్రి మమత రెడ్డి, డైరెక్టర్లు మర్రి అనుశ్రేయ రెడ్డి మరియు మర్రి ధీరేన్ రెడ్డి మరియు వివిధ విభాగాల అన్ని HODలు, విద్యార్థులు మరియు సిబ్బంది ఈ వేడుకలలో పాల్గొని దీనిని విజయవంతం చేశారు. అన్ని వార్షిక దినోత్సవ కార్యక్రమాలను MLR ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యొక్క CAME క్లబ్ విజయవంతంగా నిర్వహించారు



## హజ్ యాత్రికల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలన చేసిన హజ్ కమిటీ చైర్మెన్ కుస్రుపాషా

హైదరాబాద్ ఎప్రిల్ 26 ( సమయం న్యూస్): టిజి హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ ఖుస్రూ పాషా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ 2025 టీకా శిబిరాన్ని సందర్శించారు. హజ్ యాత్రకు వెళ్ళే హాజీల తో సంభాషించారు ఈ సందర్భంగా హాజీలకు ఏర్పాటు చేసిన వసతులు ఇతర సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ తో పాటుగా జనాబ్ హబీబ్ జైనులాబెదీన్ అబిద్ పాల్గొన్నారు.



భామిని మండలం భామిని పట్టణంలో స్థానిక MPDO కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ.

సమయం న్యూస్, భామిని, ఏప్రిల్ 25




## రజతోత్సవ సభ కోసం ప్రత్యేకంగా హెల్ప్ లైన్ ..

కమాండ్ కంట్రోల్ సెంటర్ BRS సభ కు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు . దీంట్లో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు . సభ వేదిక, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ను అనుసంధానించారు . అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఎవరికయినా సహాయం కావాల్సి వస్తే 9014206465 నెంబర్ కు ఫోన్ చేయవచ్చు . 9014206465 నెంబర్ హెల్ప్ లైన్ నెంబర్. ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి మానిటర్ చేస్తారు . ట్రాఫిక్ లో ఎవరైనా చిక్కుకున్న ఆ సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు , హెల్ప్ లైన్ కు ఇస్తే ఇక్కడి నుండి తగిన సూచనలు చేస్తారు .

# భూ మస్యల పరిష్కారానికి భూ భారతీ

వికారాబాద్ ఏప్రిల్ 26(సమయం న్యూస్) : ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా భూ సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి చట్టం ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

*** జూన్ 2 నుండి రెవెన్యూ సదస్సులు**

జూన్ రెండవ తేదీ నుండి జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లోని ప్రతి భూ సమస్యను తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. జిల్లాలో 10 నెలల క్రితం 15వేల భూ సమస్యల దరఖాస్తులు ఉండే వని, ప్రస్తుతం 5 వేల దరఖాస్తులు మాత్రమే పెండింగ్ లో ఉన్నాయని 3 మాసాల్లో రెవెన్యూ యంత్రాంగం ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని, ప్రజల సహకారం తో త్వరితగతిన భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పాలన అధికారులను నియమించనున్నట్లు అధికారులందరూ నిబద్ధతో పని చేసి సమస్యలు



పరిష్కరిస్తారని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న మండల కార్యాలయాల సముదాయ భవనాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా ప్రస్తుత డంపింగ్ యార్డ్ మార్చే నిమిత్తం వేరే స్థలాన్ని పరిశీలించి నిర్ధారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ కిషన్, ఎంపీడీవో రవీందర్ లు పాల్గొన్నారు.



ఐఏఎస్ కు ఎంపికైన సాయి చైతన్య ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా.
ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఫలితాలలో అఖిల భారత స్థాయిలో 68వ ర్యాంకు సాధించిన ఐఏఎస్ కు ఎంపికైన ఉట్నూర్ కు చెందిన గిరిజన యువకుడు సాయి చైతన్య జాదవ్ ను శనివారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా క్యాంప్ కార్యాలయం లో జ్ఞాపిక తోపాటు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



# రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలి

* **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
* **సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల పై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, ఏప్రిల్ 26:(సమయం న్యూస్) : సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన డబ్బులు రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన పరిపాలన అనుమతులను కలెక్టర్ మంజూరు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. పట్టణంలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు కోసం మున్సిపాలిటీ వెంటనే నిధులను విద్యుత్ శాఖకు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్లో ఉన్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని అన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆస్తిపన్ను వసూలు పై శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలో భవన నిర్మాణ పనులపై నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో భవన నిర్మాణాలు జరగడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోడ్లు భవనాల శాఖ భావ్ సింగ్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ నిహాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అత్యంత ప్రతిష్టాత్మకమైనది భూభారతి చట్టం

* **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**



సంగారెడ్డి ఎప్రిల్ 26( సమయం న్యూస్) : భూ భారతి ( భూమి హక్కుల చట్టం 2025) ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. పటాన్ చేరు మండలం కేంద్రంలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్, రామచంద్రాపురం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్, అమీన్పూర్ మండలం సంబంధించి బాలాజీ కన్వెన్షన్ హాల్లో భూభారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలెక్టర్ పాల్గొన్నారు. పఠాన్ చెరువు అంబేద్కర్ ఫంక్షన్ హాల్ నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ భూభారతి చట్టంతో అధికారుల వికేంద్రీకరణ జరిగిందని, పారదర్శకత జవాబుదారితనమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. భూసమస్యలు పరి ష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరాలన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చరాని, భూ సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం భూ భారతి చట్టంతోపాటు, నియమ నిబంధనలు ఒకేసారి తయారు చేసిందని, రికార్డుల నిర్వహణ, సవరణ, రిజిస్ట్రేషన్ ,మ్యుటేషన్, సాదా బైనామ ,పౌతి ,వంటి అంశాలను కలెక్టర్ వివరించారు . ధరణిలోని సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతుల సంక్షేమం కోసం తీసుకువచ్చిన భూ భారతి చట్టం పై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు, ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూభారతి, దానిలోని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు. ప్రజలందరికీ ఉచిత న్యాయ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంతకు ముందు ఉన్న చట్టం లో కోల్పోయిన హక్కులు, కొత్త చట్టంలో ఎలాంటి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, పటాన్చెరు, అమీన్పూర్, రామచంద్రపురం మండలాల తాసిల్దారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు రైతు సంఘ నాయకులు, రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు .



# భూభారతి చట్టంపై రైతులు, ప్రజలు అవగాహనను పెంపొందించుకోవాలి

* **పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

హన్మకొండ ఎప్రిల్ 26(సమయం న్యూస్) : భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై రైతులు, ప్రజలు అవగాహన పెంచుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రైతులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ధరణి అనేది రైతుల పాలిట శాపంలా దాపురించిందన్నారు. ధరణి వచ్చిన తర్వాత ఏదైనా పొరపాటును సవరించడానికి కూడా ఏ స్థాయిలోనూ స్పష్టత లేకపోవడంతో పాటు అధికారాలు లేవన్నారు. రైతులకు తమ భూమిపై సంపూర్ణ హక్కులు ఉన్నా రికార్డు వద్దకు వచ్చేసరికి ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తున్న దృష్ట్యా ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ధరణిని అధికారంలోకి వచ్చాక తీసేస్తామని హామీ ఇచ్చారని ఉన్నారు. రైతులకు సంపూర్ణమైన హక్కును కల్పించే విధంగా కొత్త చట్టం ద్వారా కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. కొన్ని భూములు ధరణిలో కనబడకుండా పోయాయని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. రైతులు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించేందుకు చట్ట బద్ధమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. గతంలో భూమీ సమగ్ర సర్వేను తీసుకువచ్చి పూర్తి చేయలేకపోయారని దీంతో రైతుల సమస్యలు అలాగే ఉండిపోయాయని అన్నారు. కానీ తమ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి మార్పు చేర్పులే కాకుండా, ఇంకా ఏవైనా కొత్తy సమస్యలు ఎదురైనట్లయితే వాటికి కూడా పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ని నాలుగు మండలాలలో పైలట్ ప్రాజెక్టు కింద పూర్తిస్థాయిలో సర్వే చేస్తూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి భూభారతి చట్టం ద్వారా సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూభారతిలో ఏవైనా అంశాలు లేనట్లయితే వాటిని కూడా గుర్తించని ఉన్నట్లు పేర్కొన్నారు. ఏ చట్టం చేసిన ప్రజల అభివృద్ధి సంక్షేమం ఆధారంగా ఉండాలన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన నాలుగు మండలాల్లో పూర్తి చేసిన తర్వాత మే 1 నుండి 15వ తేదీ వరకు ప్రతి జిల్లాలో ఒక మండలానికి భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జూన్ రెండవ తేదీ నుండి గ్రామాలలో సమగ్ర సర్వే నిర్వహించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీవో స్థాయిలోనే 90 శాతం వరకు భూ సమస్యల అసలు పరిష్కారం అవుతాయి అన్నారు.. గ్రామాలలో సర్వే పూర్తి అయిన తర్వాత సంబంధిత రైతుల వివరాలతో కూడిన ప్రదర్శించనున్నట్లు చెప్పారు. అధికారులే సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు.

# ఆధార్ తరహాలో భూకమతాలకు భూదార్ సంఖ్య కేటాయింపు

* **భూభారతి చట్టం అవగాహన సదస్సులలో కలెక్టర్ వెల్లడి**




నిజామాబాద్ ఏప్రిల్ 26 :( సమయం న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి (ఆర్.ఓ.ఆర్ 2025) నూతన చట్టం ద్వారా భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భూ కమతాలకు భూదార్ నెంబర్లను కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. నిర్దిష్ట గడువులోపు భూ సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్, నందిపేట, ఆర్మూర్ మండల కేంద్రాలలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరై భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు. ఇదివరకు అమలులో ఉన్న ధరణితో పోలిస్తే, రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని అన్నారు. భూధార్ నెంబర్ కేటాయిపు వల్ల భూ ఆక్రమణలకు, అనవసర వివాదాలకు అవకాశం ఉండదని, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు, భరోసా లభిస్తుందని అన్నారు. భూముల రికార్డులలోని పొరపాట్లను పరిష్కరించేందుకు ధరణిలో అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా అలాంటి సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పిస్తూ నూతన చట్టంలో అవకాశం కల్పించారని తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిని తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. మే, జూన్ మాసాలలో గ్రామాల వారీగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆ అర్జీలను 60 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తారని సూచించారు. ఒకవేళ రైతులు సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. గతంలో ధరణి వల్ల భూ వివాదాల పరిష్కారం కోసం సివిల్ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడే వారన్నారు. కానీ భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థ, రెవెన్యూ కోర్టుల వల్ల చాలా వరకు భూ సమస్యలు తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలోనే పరిష్కారం అవుతాయని అన్నారు. రెండంచెల అప్పీలు వ్యవస్థతో పాటు సీసీఎల్ఏ కు రివిజన్ అధికారాలు కల్పించారని సూచించారు. అప్పీలు చేసుకున్న చిన్న, సన్నకారు, పేద వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. గతంలో రికార్డులు చూసి రిజిస్ట్రేషన్లు చేసేవారని, కొత్త ఆర్ఓఆర్ చట్టంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్ర విచారణ జరిపిన తరువాతనే రిజిస్ట్రేషన్లు చేస్తారని అన్నారు. భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాల్లో సమగ్ర వివరాలతో హద్దులను పేర్కొంటూ భూమి పటం (మ్యాపు) పొందుపరుస్తారని వివరించారు. ఈ చట్టం లో నివాస స్థలాలు, గ్రామకంఠం, ఆబాది స్థలాలు, వ్యవసాయేతర భూముల వివరాలను కూడా పొందుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న సుమారు 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు భూభారతి చట్టం ద్వారా క్రమబద్దీకరించుకునే అవకాశం ఏర్పడిందని, హై కోర్టు విధించిన స్టే ఉత్తర్వులు తొలగిన మీదట వీటిని క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనున్నదని కలెక్టర్ వివరించారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 31న రికార్డుల ఆధునీకరణ చేస్తారని అన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నూతన చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ,17 రాష్ట్రాలలో నిపుణులు సమగ్ర అధ్యయనం చేసి, అన్ని రకాల భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఉపయుక్తంగా ఉండేలా ప్రభుత్వం భూభారతి నూతన చట్టం రూపొందించిందని తెలిపారు. ధరణి పోర్టల్ కారణంగా భూ సమస్యలు పెరిగిపోయాయని అన్నారు. అప్పుడు కేవలం భూ సమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్ కి ఉండేదని, నూతన చట్టంతో అధికార వికేంద్రీకరణ జరిగి కింది స్థాయి అధికారులకు కూడా అధికారాలు కల్పించారని తెలిపారు. ఏవైనా భూసమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు. నిర్ణీత గడువు లోపు దరఖాస్తులను పరిష్కరిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సదస్సులలో నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి, ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ చైర్మన్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణ వెట్టిచాకిరి ని అన్ని శాఖలు పరస్పర సహకారం,సమన్వయం తో నిర్మూలించాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపి రెడ్డి**



మహబూబ్ నగర్ ఏప్రిల్26( సమయం న్యూస్) : శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార ఆదేశాల ననుసరించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు మానవ అక్రమ రవాణా,వెట్టి చాకిరి నిర్మూలన పై నిర్వహించిన అవగాహన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బి.పాపి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి.డి.జానకి,, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి డి. ఇందిర లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాను మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి రహిత జిల్లా గా రూపొందించాలని అన్నారు.మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి నేరం అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. చిన్న పిల్లలు, మహిళల మానవ అక్రమ రవాణా గుర్తించేందుకు,ఇటువంటి సంఘటనలు. జరుగకుండా ముందు జాగ్రత్త లు తీసుకోవాలని, సమస్య వచ్చినట్లయితే ఏ విధంగా చట్ట పరంగా చర్యలు తీసుకోవాల్సిన విషయాలపై శిక్షణలో తెలుసుకోవాలని సూచించారు. సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న చట్టాలు క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేసే విధంగా కార్యాచరణ తో సిద్ధంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా విషయంలో ముంబై, ఢిల్లీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మహబూబ్ జిల్లాలో ఇటువంటి సంఘటనలు చాలా తక్కువగా ఉన్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ వారికి అన్ని శాఖల సహకారం అందించాలని ఆయన కోరారు. చైల్డ్ లేబర్ మరియు మానవ అక్రమ రవాణా పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ చిన్నపిల్లలు, మహిళలను మానవ అక్రమ రవాణా చేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.మానవులను ఒక ఆట వస్తువుగా లైంగిక హింసకు గురి చేయడం,పని మనుషులుగా పని చేయడం కోసం తదితర కారణాల వలన రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు దేశాలకు రవాణా చేయడం జరుగుతుందని అన్నారు.ఒరిస్సా,ఝార్ఖండ్ రాష్ట్రాల నుండి కార్మికులు వలసలు గా వచ్చి పని చేస్తున్నారని, వీరికి సరైన విద్య,వైద్య సదుపాయాలు కల్పించక మానవ హక్కులు కాలరాస్తున్నట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణా,బాల కార్మికుల వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రభుత్వం చట్టాలు రూపొందించినట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణా, బాల కార్మికుల వెట్టి చాకిరి నుండి సంరక్షించిన వారిని జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం,సుప్రీం కోర్టు ఆదేశాల ననుసరించి పర్యవేక్షణకు వివిధ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ముఖేష్ అంబానీ చిన్న కొడుకు
# అనంత అంబానీకి కీలక బాధ్యతలు



**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్ ముఖేష్ అంబానీ 2022 లోనే కంపెనీలోని వివిధ వ్యాపారాల బాధ్యతను తన ముగ్గురు పిల్లలకు విభజించారు. కుమార్తె ఇషా అంబానీకి రిటైల్ బాధ్యత, పెద్ద కుమారుడు ఆకాష్ అంబానీకి టెలికాం బాధ్యత, చిన్న కుమారుడు అనంత్ అంబానీకి ఇంధన రంగ బాధ్యత అప్పగించారు. కానీ ఇటీవల ముఖేష్ అంబానీ తన చిన్న కొడుకుకు కొత్త బాధ్యతను అప్పగించారు.

### అనంత అంబానీకి కొత్త బాధ్యత:

ఇప్పుడు ఆ కంపెనీ మరో పెద్ద అడుగు వేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ల బోర్డు మే 1, 2025 నుండి ఐదు సంవత్సరాల కాలానికి అనంత్ అంబానీని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించడానికి ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు ఆయన కంపెనీతో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనుబంధంగా ఉన్నారు. అనంత్ అంబానీ మార్చి 2020 నుండి జియో ప్లాట్‌ఫామ్ లిమిటెడ్ బోర్డులో ఉన్నారు. మే 2022 నుండి ఆయన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ బోర్డుకు కూడా తోడ్పడటం ప్రారంభించారు. దీనితో పాటు అతను జూన్ 2021 నుండి రిలయన్స్ న్యూ ఎనర్జీ లిమిటెడ్, రిలయన్స్ న్యూ సోలార్ ఎనర్జీ లిమిటెడ్ బోర్డులో కూడా ఉన్నాడు. సెప్టెంబర్ 2022 నుండి అతను గ్రూప్ దాతృత్వ విభాగమైన రిలయన్స్ ఫౌండేషన్ బోర్డులో కూడా ఉన్నాడు. బ్రౌన్ విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడైన అనంత్, కంపెనీలోని అనేక కీలక రంగాలలో నాయకత్వ అనుభవాన్ని పొందాడు.

ఈ నిర్ణయం అంబానీ కుటుంబం వారసత్వ ప్రణాళికలో భాగం. దీని కింద వ్యూహాత్మక బాధ్యతలను తరువాతి తరానికి అప్పగిస్తున్నారు. ఏజీఎంలో కూడా, ముఖేష్ అంబానీ అనంత్ నాయకత్వ సామర్థ్యాన్ని, ఇంధన రంగంపై ఆయనకున్న అవగాహనను ప్రశంసించారు.

### ఆర్ఐఎల్ చరిత్ర సృష్టించింది:

జనవరి-మార్చి 2025 త్రైమాసిక ఫలితాలను విడుదల చేయడం ద్వారా రిల్ కొత్త రికార్డును సృష్టించింది. 10 లక్షల కోట్ల రూపాయల ఈక్విటీని దాటిన తొలి భారతీయ కంపెనీగా రిలయన్స్ నిలిచింది.

### డిజిటల్ సేవల నుండి రికార్డు ఆదాయాలు:

ఈ త్రైమాసికంలో రిలయన్స్ డిజిటల్ సేవలు రికార్డు స్థాయిలో ఆదాయం, లాభాలను ఆర్జించాయని కంపెనీ చైర్మన్ ముఖేష్ అంబానీ అన్నారు. మెరుగైన యూజర్ ఎంగేజ్‌మెంట్, బలమైన సబ్‌స్క్రైబర్ మిశ్రమం కారణంగా ఆదాయాలు పెరిగాయి.

### 25,000 కోట్లు సేకరించాలని ప్రణాళిక:

25,000 కోట్ల వరకు నిధులు సేకరించడానికి రిల్ డైరెక్టర్ల బోర్డు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మొత్తాన్ని ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా లిస్టెడ్ లేదా అన్‌లిస్టెడ్, సెక్యూర్డ్ లేదా అన్‌సెక్యూర్డ్, నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్ల ద్వారా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతలుగా సేకరించడం జరుగుతుంది.

# ధర తక్కువ కూలింగ్ ఎక్కువ..

## మార్కెట్లో టాప్ 5 పోర్టబుల్ ఎయిర్ కూలర్లు..



**న్యూఢిల్లీ:** మన దేశంలో ఎయిర్ కండీషనర్లు ఖరీదైనవి. వీటి ద్వారా వచ్చే కరెంటు బిల్లులు కట్టేంత స్థోమత లేని వారికోసం మినీ పోర్టబుల్ ఎయిర్ కూలర్లు సరసమైన, శక్తి-సమర్థవంతమైన పరిష్కారంగా కనపడుతున్నాయి. ఈ కాంపాక్ట్ పరికరాలు ఎక్కడికైనా తేలికగా తీసుకెళ్లగం. సులభంగా ఇన్‌స్టాల్ చేయొచ్చు కూడా. చిన్న గదులకు లేదా వ్యక్తిగత ఉపయోగం కోసం అద్భుతమైన చల్లదనాన్ని అందిస్తాయి.

### 1. సింఫనీ హై-స్పీడ్ పర్సనల్ కూలర్

సింఫనీ బ్రాండ్ దాని నాణ్యమైన కూలింగ్ పరిష్కారాలకు ప్రసిద్ధి చెందింది. ఈ మినీ పోర్టబుల్ కూలర్ చిన్న గదులకు లేదా వ్యక్తిగత ఉపయోగం కోసం రూపొందించబడింది. ఇది శక్తివంతమైన బ్లోవర్ హనీకోంబ్ కూలింగ్ ప్యాడ్‌లను కలిగి ఉంది, ఇవి సమర్థవంతమైన ఆవిరి కూలింగ్‌ను అందిస్తాయి. 360-డిగ్రీల సర్దుబాటు ఎయిర్ వెంట్ గాలి ప్రవాహాన్ని అనుకూలీకరించడానికి అనుమతిస్తుంది, దాని కాంపాక్ట్ డిజైన్ దీనిని డెస్క్‌లు, బెడ్‌సైడ్ టేబుల్స్ లేదా చిన్న కార్యాలయాలకు అనువైనదిగా చేస్తుంది. యూఎస్‌బీ ఛార్జింగ్ ఆప్షన్ దీని పోర్టబిలిటీని మరింత మెరుగుపరుస్తుంది. ధర సుమారు రూ.3,000 నుండి రూ. 5,000 వరకు ఉంటుంది, ఇది బడ్జెట్‌కు తగిన ఎంపికగా నిలుస్తుంది.

### 2. బజాజ్ ప్లాటినా మినీ కూలర్

బజాజ్ ప్లాటినా మినీ కూలర్ తక్కువ ధరలో అద్భుతమైన కూలింగ్ అనుభవాన్ని అందిస్తుంది. ఈ కూలర్ హనీకోంబ్ కూలింగ్ ప్యాడ్‌లు టర్బో ఫ్యాన్ టెక్నాలజీని ఉపయోగిస్తుంది, ఇవి తక్షణ చల్లదనాన్ని అందిస్తాయి. 15-లీటర్ వాటర్ ట్యాంక్ రీఫిల్ చేయకుండా గంటలపాటు కూలింగ్‌ను నిర్ధారిస్తుంది. దీని సొగసైన డిజైన్ తేలికైన నిర్మాణం ఒక గది నుండి మరొక గదికి తరలించడాన్ని సులభతరం చేస్తుంది. ఇది తక్కువ విద్యుత్ వినియోగంతో పనిచేస్తుంది, ఇది చిన్న కుటుంబాలకు లేదా విద్యార్థులకు అనువైనది. ధర సుమారు రూ. 4,000 నుండి రూ. 6,000 వరకు ఉంటుంది.

### 3. క్రాంప్టన్ ఓజోన్ పర్సనల్ కూలర్

క్రాంప్టన్ ఓజోన్ మినీ కూలర్ దాని అధిక-వేగ ఫ్యాన్ అధునాతన కూలింగ్ టెక్నాలజీతో గుర్తింపు పొందింది. ఈ కూలర్ 10-లీటర్ వాటర్ ట్యాంక్‌ను కలిగి ఉంది, ఇది చిన్న స్థలాలకు తగినంత కూలింగ్‌ను అందిస్తుంది. దీని హనీకోంబ్ ప్యాడ్‌లు 25% అధిక నీటిని నిలుపుకుంటాయి, దీర్ఘకాల చల్లదనాన్ని అందిస్తాయి. ఇది ఐస్ కంపార్ట్‌మెంట్‌ను కూడా కలిగి ఉంది, ఇది అదనపు కూలింగ్ కోసం ఐస్ క్యూబ్‌లను జోడించడానికి అనుమతిస్తుంది. ఈ కూలర్ ఇన్వర్టర్ అనుకూలతను కలిగి ఉంది, విద్యుత్ కోతల సమయంలో కూడా నిరంతర కూలింగ్‌ను నిర్ధారిస్తుంది. ధర సుమారు రూ. 3,500 నుండి రూ. 5,500 వరకు ఉంటుంది.

### 4. ఓరియంట్ ఎలక్ట్రిక్ స్మార్ట్ కూల్

ఓరియంట్ ఎలక్ట్రిక్ స్మార్ట్ కూల్ మినీ కూలర్ ఆధునిక ఫీచర్లు సరసమైన ధరతో వస్తున్నాయి. ఇది ఏరోఫాన్ టెక్నాలజీని కలిగి ఉంది, ఇది 17% ఎక్కువ గాలి ప్రసరణను అందిస్తుంది. దీని డెన్స్‌నెస్ట్ హనీకోంబ్ ప్యాడ్‌లు అధిక నీటి నిలుపుదలతో 25% అధిక కూలింగ్‌ను అందిస్తాయి. ఈ కూలర్ రిమోట్ కంట్రోల్ ఆపరేషన్ వాటర్ లెవల్ ఇండికేటర్‌ను కలిగి ఉంది, ఇది వినియోగదారు సౌలభ్యాన్ని పెంచుతుంది. దీని కాంపాక్ట్ సైజు చక్రాల డిజైన్ సులభమైన చలనశీలతను అందిస్తుంది. ధర సుమారు రూ. 4,500 నుండి రూ. 7,000 వరకు ఉంటుంది.

### 5. లైఫ్‌లాంగ్ పోర్టబుల్ కూలర్

లైఫ్‌లాంగ్ పోర్టబుల్ కూలర్ బడ్జెట్ స్పృహ కలిగిన కొనుగోలుదారులకు అద్భుతమైన ఎంపిక. ఈ కూలర్ 25-లీటర్ ట్యాంక్, హనీకోంబ్ ప్యాడ్‌లు శక్తివంతమైన ఎయిర్ థ్రోను కలిగి ఉంది. ఇది ఐస్ కోల్డ్ రిలీఫ్ ఫీచర్‌ను అందిస్తుంది, ఇది తీవ్రమైన వేడిలో తక్షణ చల్లదనాన్ని అందిస్తుంది. దీని తక్కువ శక్తి వినియోగం మరియు ఇన్వర్టర్ అనుకూలత దీనిని ఆర్థికంగా మరియు నమ్మదగినదిగా చేస్తుంది. ధర సుమారు రూ. 3,000 నుండి రూ. 5,000 వరకు ఉంటుంది, ఇది చిన్న స్థలాలకు ఆదర్శవంతమైన ఎంపికగా నిలుస్తుంది.




# కేకేఆర్- పంజాబ్ కింగ్స్
# మ్యాచ్ వర్షార్పణం..

## చెరొక పాయింట్ సమర్పయామి!



**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం రాకుండానే ముగిసింది. పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ పూర్తయి.. కేకేఆర్ బ్యాటింగ్ ఒక ఓవర్ పూర్తయ్యాక వర్షం ప్రారంభమైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరిగింది. అయితే వర్షం తగ్గితే మ్యాచ్ రీస్టార్ట్ చేద్దామని.. అంపైర్లు గ్రౌండ్ సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించారు.

ఓ దశలో వర్షం తగ్గినట్లే కనిపించింది. దీంతో ఓవర్లలో కోత పడినా.. మ్యాచ్ మాత్రం జరుగుతుందని అంతా భావించారు. కానీ కాసేపటికే వరుణుడు మళ్లీ జోరందుకున్నాడు. ఈసారి మరింత ఎక్కువగా వర్షం కురవడంతో స్టేడియం చిత్తడిగా మారింది. దీంతో మ్యాచ్ నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కటాఫ్ సమయానికంటే ముందే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించాల్సి వచ్చింది. రెండు జట్లకూ చెరో పాయింట్ చొప్పున కేటాయించారు.

అంతకముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 రన్స్ స్కోరు చేసింది. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్యా (35 బంతుల్లో 69 రన్స్), ప్రభసిమ్రాన్ సింగ్ (49 బంతుల్లో 83 రన్స్) సత్తాచాటారు. శ్రేయస్ అయ్యర్ (16 బంతుల్లో 25 రన్స్ నాటౌట్), జోష్ ఇంగ్లిస్ (6 బంతుల్లో 11 రన్స్) ఫర్వాలేదనిపించారు. కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లలో వైభవ్ అరోరా 2 వికెట్లు, వరుణ్ చక్రవర్తి 1, ఆండ్రీ రసెల్ 1 వికెట్ తీశారు. ఆ తర్వాత 202 పరుగుల లక్ష్యంతో కేకేఆర్ బ్యాటింగ్ ప్రారంభించింది. ఒక ఓవర్ పూర్తయి.. కేకేఆర్ స్కోరు 7/0 వద్ద ఉండగా వర్షం మొదలైంది. ఆ తర్వాత మళ్లీ మ్యాచ్ జరగలేదు.

ఈ ఫలితంతో రెండు జట్లకూ చెరో పాయింట్ దక్కింది. దీంతో పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో తన స్థానాన్ని మెరుగుపర్చుకుంది. ముంబై ఇండియన్స్‌ను వెనక్కి నెట్టి ఆ జట్టు టాప్-4లోకి అడుగుపెట్టింది.

# వేలంలోనే తప్పులు జరిగాయి

## సీఎస్‌కే కోచ్ ఫ్లెమింగ్ వ్యాఖ్యలు..!



**చెన్నై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్ ఆశలు గల్లంతయ్యాయి. ఐదుసార్లు చాంపియన్స్‌గా నిలిచిన సీఎస్‌కే ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించడంతో అభిమానులు నిరాశకు గురవుతున్నారు. ఈ క్రమంలో సీఎస్‌కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ జట్టు పేలవ ప్రదర్శనపై స్పందించాడు. గతేడాది జరిగిన వేలం సమయంలోనే తమ జట్టు తప్పు చేసిందని కీలక వ్యాఖ్యలు చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌తో తమ జట్టు ఆడిన విధానం పూర్తిగా అనుకూలంగా ఉందని చెప్పడం కష్టమేనన్నారు. అయితే, దీన్ని పునః పరిశీలించుకొని మెరుగుపరిచేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామని చెప్పుకొచ్చాడు. తమ గత రికార్డులపై గర్వంగా ఉన్నామని.. లీగ్‌లో చాలాకాలంగా ఆధిపత్యం చెలాయించామని ఫ్లెమింగ్ పేర్కొన్నారు.

ఈ దశ నుంచి త్వరగానే బయటపడుతామన్నాడు. అయితే, జట్టును సమర్థించిన కోచ్.. వేలంలో యాజమాన్యం పలు తప్పులు చేసిందని తెలిపాడు. వేలంలో చాలా జట్లు సీఎస్కే కంటే మంచి ఆటగాళ్లను ఎంచుకున్నాయని.. తాము మాత్రం దాన్ని సరిగా చేయలేకపోయామని తెలిపాడు. వేలం అనుకున్నంత వరకు బాగా జరుగలేదని.. కోరుకున్న విధంగా జరుగలేదని తెలిపాడు. వేలం చాలా త్వరగా జరిగే ప్రక్రియని.. నిజాయితీగా చెప్పాలంటే సీఎస్‌కేకు ఇప్పటికీ మంచి జట్టు ఉందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, జట్టు కలయికను సిద్ధం చేయలేకపోయామని.. తమ జట్టు తిరిగి ఫామ్‌లోకి వచ్చేందుకు ఇంకా ఎంతో సమయం లేదని పేర్కొన్నారు. మరో వైపు కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మాట్లాడుతూ.. నలుగురు, ఐదుగురు ఒకేసారి ఫామ్ కోల్పోయిన సమయంలో జట్టు ఆశించిన ఫలితాలను సాధించడం కష్టమని చెప్పాడు. అలాంటి సమయంలో టోర్నీలో ఒకటి, రెండు లోపాలను అధిగమించాల్సి వస్తే అది మంచిదేనని.. కానీ, చాలామంది ఆటగాళ్లు బాగా రాణించిన సమయంలో కష్టంగా మారుతుందని తెలిపాడు.

జట్టు తగినన్ని పరుగులు సాధించలేకపోతుందని.. వరుసగా వికెట్లు కోల్పోతూ వస్తూనే ఉందని చెప్పాడు. మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ కొంచెం మెరుగ్గా ఉందని.. 154 పరుగులు పెద్ద స్కోర్ ఏం కాదని.. బంతి పెద్దగా తిరగలేదని.. రెండో ఇన్నింగ్స్‌లో కొంత సహకారం లభించిందని చెప్పాడు. నాణ్యమైన స్పిన్నర్లు జట్టులో ఉన్నారని.. సరైన దిశలోనే బౌలింగ్ చేస్తున్నారని తెలిపాడు.

# జోక్ కాదు.. పాక్‌తో క్రికెట్ మ్యాచ్‌లే వద్దు : సౌరవ్ గంగూలీ

**కోల్‌కతా:** పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన పట్ల భారత మాజీ క్రికెటర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌తో అన్ని క్రికెట్ సంబంధాలను తెంచుకోవాలని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కోల్‌కతాలో ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. పాకిస్థాన్‌తో క్రికెట్ బంధాన్ని వంద శాతం నిలిపివేయాలని, చాలా కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఇలాంటి ఘటనలు జరగడం జోక్‌గా తీసుకోవద్దు అని, ఉగ్రవాదాన్ని సహించలేమని గంగూలీ తెలిపారు. వాస్తవానికి చాన్నాళ్ల నుంచి పాక్, ఇండియా మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ జరగడం లేదు. ఇటీవల కేవలం ఐసీసీ నిర్వహించే ఈవెంట్లలో మాత్రమే ఆ రెండు దేశాలు పోటీపడుతున్నాయి.




రెండు దేశాల మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2008 నుంచి పాక్‌లో ఇండియా పర్యటించలేదు. చివరిసారి ఆసియాకప్‌లో ఆ జట్లు తలపడ్డాయి. 2012-13లో చివరిసారి ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొన్నాయి. ఇటీవల నిర్వహించిన ఐసీసీ టోర్నీలో పాల్గొన్నా.. పాకిస్థాన్‌లో ఆడేందుకు మాత్రం ఇండియా నిరాకరించింది. దుబాయ్‌లోనే ఆ దేశంతో మ్యాచ్‌లు ఆడింది. ఇండియా, పాకిస్థాన్ మధ్య హైబ్రిడ్ మోడల్ క్రికెట్ జరగాలని ఇటీవల ఐసీసీ నిర్ణయించిన విషయం తెలిసిందే. తటస్థ వేదికలపై ఆడేందుకు నిర్ణయించారు. కానీ ఇప్పుడు ఆ వేదికల్లోనూ ఆడరాదు అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# భారత యువ బాక్సర్ల జోరు..

## 43 పతకాలు ఖరారు

**న్యూఢిల్లీ:** జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు పంచ్‌లతో చెలరేగుతున్నారు. ప్రత్యర్థులను అలవోకగా చిత్తు చేస్తూ పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటికే 39 పతకాలు ఖరారు కాగా శనివారం మరో నలుగురు సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లారు. దాంతో, ఈసారి దాదాపు 43 పతకాలు భారత బాక్సర్ల ఖాతాలో చేరనున్నాయి. జోర్డాన్ వేదికగా ఆసియా బాక్సింగ్ సమాఖ్య నిర్వహిస్తున్న అండర్ -15, అండర్ -17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత కుర్రాళ్లు, అమ్మాయిలు తమ పంచ్ పవర్ చూపిస్తున్నారు.

అండర్ -17 పురుషుల విభాగంలో అమన్ సివచ్ (63 కిలోలు), దేవాన్ష్ (80 కిలోలు) తమ తడాఖా చూపించారు. ఐదో రోజు జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఫిలిప్పీన్స్, జోర్డాన్‌కు చెందిన ఆటగాళ్లను మట్టికరిపించారు. మహిళల 60 కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్ పంచ్‌కు జోర్డాన్ బాక్సర్ అయా అల్హసనత్ చేతులెత్తేసింది. కనీస పోరాటం చేయకుండానే 5-0తో చిత్తుగా ఓడిపోయింది. ఇక 70 కిలోల ఫైట్‌లో హిమాన్షు పాలస్తీనా బాక్సర్ చేతిలో పోరాడి ఓడిపోయింది.







### పురుషుల అండర్ -17 క్వార్టర్ ఫైనల్

అమన్ సివాచ్-63 కిలోలు.. ఫిలిప్పీన్స్‌కు చెందిన జియాడ్రాచ్ జేమ్స్ కబ్రెరాపై విజయం.

సాహిల్ దుహాన్-60 కిలోలు- ఇరాన్ బాక్సర్ అమిరలీ చేతిలో ఓటమి.

అనంత్ గౌరీ శంకర్ దేశముఖ్ - 66 కిలోలు - కజకిస్థాన్ బాకర్స్ దనియల్ శల్కర్‌బే చేతిలో ఓటమి.

ప్రియాన్ష్ షెహ్రావత్ - 75 కిలోలు - ఉజ్బెకిస్థాన్ బాక్సర్ ఖుర్షిద్‌బెక్ జురేవ్ చేతిలో పరాజయం.

దేవాన్ష్ గులియా - 8- కిలోలు - జోర్డాన్ బాక్సర్ అబ్దుల్లా అల్దబ్బాస్‌పై విజయం.

లోవెన్ గులియా - 80 కిలోలు - ఇరాన్ బాక్సర్ ఫర్హాద్ ఘోర్బనీ ధాటికి చేతులెత్తేశాడు.

# MOVIE TIME

## త్వరలోనే రాజాసాబ్ టీజర్ విడుదల

### సన్నాహాల్లో మూవీ బృందం




**టాకీస్:** ప్రభాస్ నటిస్తున్న తాజా సినిమా రాజాసాబ్. షూటింగ్ స్టార్ట్ చేసి చాలాకాలం అవుతున్నా ఈ సినిమా ఇంకా అలానే సాగుతూ.. ఉంది. అదిరిపోయే పాటలు, ఫైట్స్, కామెడీ, డ్యాన్స్‌తో పాటు ముగ్గురు హీరోయిన్లతో రొమాన్స్ చేస్తున్నాడు డార్లింగ్. పైగా ఫస్ట్ హార్రర్ రొమాంటిక్ కామెడీ మూవీ రాజాసాబ్. ఇన్ని విశేషాలు ఉన్న ఈ సినిమా ఎందుకనో స్టార్ట్ అయిన దగ్గరునుండి రిలీజ్ వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పటికే రివీల్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. వాస్తవానికి ఈ సినిమాను ఏప్రిల్ 10న రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికి ఈ సినిమా షూటింగ్ పెండింగ్ దశలోనే ఉంది. కానీ దర్శకుడు మారుతి మాత్రం సమ్మర్‌లో అదిరిపోయే ట్రీట్ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. రీసెంట్‌గా మే నెల మిడ్‌లో అప్డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు మారుతి. హై అలర్ట్ మే నెలలో హీట్ వేవ్స్ మరింత పెరగనున్నాయి అని ఒక టీ-÷-వట్ చేశారు. దీంతో ఎలాంటి అప్డేట్ ఇవ్వబోతున్నాడా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు రెబల్ ఫ్యాన్స్. అయితే రాజాసాబ్ టీ-జర్ రిలీజ్‌కు మారుతీ ఎ÷-లాన్ చేస్తున్నట్టుగా సమాచారం. ప్రస్తుతం సాలిడ్ టీజర్ కట్ చేసే పనిలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ టీజర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్ పనులు కూడా పూర్తయ్యాయని తెలుస్తోంది. ప్రస్తుతం విదేశాలలో ఉన్న ప్రభాస్ తిరిగి రాగానే తనతో డబ్బింగ్ పూర్తి చేసి టీజర్ విడుదల తేదీని రివీల్ చేస్తారని సమాచారం. అందాల భామలు నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది.




## శర్వానంద్‌తో మరోమారు అనుపమ జోడీ

### సంపత్ నంది సినిమా కోసం కథ సిద్ధం



టాకీస్: టాలీవుడ్ నటుడు శర్వానంద్ తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. సంపత్ నంది ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. 1960ల చివర్లో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. మరపురాని అనుభూతిని కలిగించే పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రాబోతుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే మూవీ కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు శర్వానంద్. మే మొదటివారం నుంచి షూటింగ్ శరవేగంగా ప్రారంభం కాబోతుండగా.. ఈ సినిమా కోసం హైదరాబాద్ సమీపంలో 15 ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేశారు. ఇదిలావుంటే ఈ మూవీలో కథానాయికకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీలో హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. గతంలో శర్వానంద్, అనుపమ కలిసి శతమానం భవతి అనే సినిమాలో నటించారు. దిల్ రాజ్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ జోడి మళ్లీ జత కడుతుండడంతో భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్.ఎస్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.

## అనసూయ.. చీరలో కూడా స్టన్నింగ్..




టాకీస్: టీవీ యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అనసూయ, తన ఎనర్జిటిక్ హెూస్టింగ్ స్టైల్‌తో ఫ్యాన్ ఫాలోయింగ్‌ను ఏర్పరుచుకుంది. కానీ అక్కడితో ఆగలేదు. సిల్వర్ స్క్రీన్‌పై అడుగుపెట్టి విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, ఒక నటి గా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంది. "రంగస్థలం" సినిమాలో రంగమ్మత్త పాత్ర ఆమెకు గుర్తింపు తీసుకు వచ్చింది. అప్పటి నుంచి గ్లామర్, పవర్‌ఫుల్ రోల్స్‌తో పాటు సోషల్ మీడియాలోనూ క్రేజ్ పెంచుకుంటూ వస్తోంది. ఇప్పుడు అనసూయ తన కొత్త లుక్‌తో మళ్లీ ఫ్యాన్స్ మనసులు దోచేస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. బంగారు వర్ణం కలిగిన చీరలో అనసూయ సంప్రదాయ సౌందర్యాన్ని మలుపుతిప్పినట్టుగా కనిపిస్తోంది. ఈ చీరలోని పింక్, గ్రీన్ పువ్వుల డిజైన్లు అందరినీ ఆకర్షించగా, బోల్డ్ లుక్‌కు బదులుగా కాస్త నెమ్మదిగా నవ్వుతూ ఆమె ఇచ్చిన స్టిల్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ లుక్‌కు మేకోవర్‌గా చేసిన జ్యువెల్లరీ, మెరిసే చీర, ఎర్రకళ్ల బ్లౌజ్ కూడా అదనపు ఆకర్షణగా నిలిచాయి. అనసూయ ధరించిన చెవిపోగులు, చేతికడులు ఆమె సంప్రదాయ అందాన్ని మరింతగా హైలైట్ చేశాయి. ముఖ్యంగా ఆమె జడలో పెట్టిన పుష్పాల అలంకరణ ప్రత్యేకంగా చూపుతుంది. మేకప్ సాఫ్ట్‌గా ఉండగా, హైలైట్ అయిన అనసూయ నవ్వే ప్రధాన అస్త్రం అని చెప్పవచ్చు. ఈ ఫోటోలకు 3 గంటల్లోనే వేల సంఖ్యలో లైక్స్ రావడం చూస్తే, అనసూయకి ఉన్న క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఇలా ఫ్యాషన్‌లో ముందుండే అనసూయ ఈసారి సంప్రదాయానికి టచ్ ఇచ్చి అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఆమె చూపించిన ఈ లుక్ ఒక పండగ స్పెషల్‌లా అనిపిస్తోంది.

## అమ్మా,నాన్నల విడాకులు తీవ్రంగా కలచివేసింది

### నటి శృతిహాసన్ మనోగతం

**టాకీస్:** తల్లిదండ్రులు విడిపోతే పిల్లల జీవితాలు దుర్భరంగా మారుతాయి. ఒక్కోసారి తలకిందులవుతాయి. ముఖ్యంగా సినిమాపరిశ్రమలో విడాకుల వ్యవహారాలు చాలానే ఉన్నాయి. అందులో కమలహాసన్, సారికల ఎపిసోడ్ కూడా ఉంది. వారి కూతురే శృతిహాసన్. కమల్‌హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీక్రి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రుతి హాసన్ సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడించారు. ఇండస్ట్రీక్రి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు. తాను ఇండస్ట్రీక్రి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో




చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్‌లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండస్ట్రీక్రి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను' అని చెప్పారు. శ్రుతిహాసన్ తల్లిదండ్రులు కమల్ హాసన్ , సారిక 2004లో విడిపోయిన సంగతి తెలిసిందే.

## రాజసం ఉట్టిపడేలా వీరమల్లు భామ.. 'నిధి అగర్వాల్'




టాకీస్: అందం, అభినయం దండిగా ఉన్నా బ్రేక్ కోసం శాయశక్తులా శ్రమిస్తున్నారు నిధి అగర్వాల్. టాలీవుడ్‌లో ఫలితం కనిపించకపోవడంతో అటు ఇటూ ఓ చూపు చూసిన ఈ ముద్దుగుమ్మ తిరిగి తెలుగులోనే తన లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. 17 ఆగస్ట్ 1992న హైదరాబాద్‌లో స్థిరపడిన మార్వాడీ కుటుంబంలో జన్మించారు నిధి అగర్వాల్. మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ఈ భామ .. సినిమాలపై ఆసక్తితో 2017లో టైగర్ ష్రాఫ్ హీరోగా వచ్చిన మున్నా మైఖేల్‌తో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. అనంతం అక్కినేని నాగచైతన్య నటించిన సవ్యసాచితో తెలుగువారిని పలకరించారు నిధి అగర్వాల్. ఈ సినిమా తర్వాత మిస్టర్ మజ్ను, ఇస్మార్ట్ శంకర్, హీరో చిత్రాలలో నటించారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఎనర్జిటిక్ రామ్ పోతినేని హీరోగా వచ్చిన ఇస్మార్ట్ శంకర్ చిత్రం నిధి అగర్వాల్‌కు బ్రేక్ ఇచ్చింది. ఈ ఫేమ్‌తో తెలుగుతో పాటు తమిళ్‌లోనూ అవకాశాలు క్యూకట్టాయి. ఈశ్వరన్, భూమి, కలగ తలైవన్ తదితర చిత్రాల్లో ఆమె నటించారు. ప్రస్తుతం జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తోన్న 'హరిహర వీరమల్లు'. పాన్ ఇండియా స్థార్ ప్రభాస్ హీరోగా వస్తోన్న 'ది రాజా సాబ్'లో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తన నట జీవితంలోనే తొలిసారిగా ఇద్దరు సూపర్‌స్టార్లతో నటిస్తుండటంతో నిధి మంచి జోష్‌లో ఉన్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.